సాక్షి
ప్రకాశం
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



జగనన్న పోరాటం పేదరికంపైనే..
జగనన్న పోరాటం పార్టీలు, ప్రతిపక్షాలపై కాదు.. కేవలం పేదరికం మీదేనని రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.
- 8లో..



గిద్దలూరు ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధం
రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సీఎం జగన్ అవకాశం ఇచ్చారని ఎమ్మెల్యే కేపీ అన్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
34/23

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ స్థల పరిశీలన



రైల్వేలైన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, పక్కన ఆర్డీవో ఇర్విన్

పామూరు: నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మించే మండలంలోని రావిగుంటపల్లె, నర్రమారెళ్ల, ఇనిమెర్ల గ్రామాలకు చెందిన భూములను శుక్రవారం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ నర్రమారెళ్ల వద్ద పరిశీలించారు. ఈసందర్భంగా ప్రతిపాదిత రైల్వేలైన్, భూముల మ్యాప్‌ను ఆయన పరిశీలించి వివరాలను కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పరిహారంపై ఆర్డీవోతో చర్చించారు. ఇప్పటికే కొంత మంది రైతులకు పరిహారం రాగా నాడు చుక్కల భూమిగా ఉండి ప్రభుత్వ చొరవతో సాధారణ భూమిగా రికార్డుల్లో మార్పు చెందిన భూములకు పరిహారం ఇచ్చేందుకు వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా మార్కెట్ ధరలకు అనుగుణంగా మెరుగైన పరిహారం ఇప్పించాలని గతంలో రైతులు కోరిన నేపథ్యంతో రైల్వేలైన్ వెళ్లే ప్రాంతంలో ప్రస్తుతం భూమి మార్కెట్ ధరలపై ఆర్డీవో, రైతులతో చర్చించారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, పామూరు తహసీల్దార్ షేక్.షకీర్‌పాషా, జేసీ సీసీ ఆంజనేయులు, రీసర్వే డీటీ పృథ్వి, వీఆర్వో మండ్లా శ్రీను, సర్వేయర్ కే.మానస పాల్గొన్నారు.

అభ్యంతరాలను 12లోగా తెలియజేయాలి

ఒంగోలు: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఓసీ-జీ (స్పోర్ట్) కేటగిరీకి చెందిన ప్రిన్సిపాల్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీచేసేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి టెంటేటివ్ ప్రయారిటీ జాబితాను ఒంగోలు సమగ్రశిక్ష కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమగ్రశిక్ష కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

రైతు నేస్తాలు

నాడు..

టీడీపీ ప్రభుత్వంలో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం రోడ్డెక్కేవారు. ఇంకా చెప్పాలంటే కల్తీ పురుగుమందులను నివారించాలని కూడా ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. నాణ్యమైన విత్తనాలు సకాలంలో దొరక్క ఎన్నో ఇబ్బందులు పడేవారు. అప్పట్లో మండలానికి ఒక వ్యవసాయాధికారి మాత్రమే ఉండేవారు. దీనితో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నా సాధ్యమయ్యేది కాదు.

నేడు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా రైతు భరోసా కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేశారు. వాటి ద్వారా రైతులకు అవసరమైన సర్టిఫైడ్ విత్తనాలు, ఎరువులను నేరుగా రైతుల ఇళ్లకే అందించే ఏర్పాట్లు చేశారు. గడిచిన ఐదేళ్లలో ఎక్కడా రైతులు రోడ్డెక్కి విత్తనాలు, ఎరువుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సంఘటనలు లేవు. నేడు గ్రామాల్లో సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించడంతో రైతులకు వారు అందుబాటులో ఉన్నారు.



సీతానాగులవరం రైతుభరోసా కేంద్రం

- రైతు భరోసా కేంద్రాలతో రైతులకు మేలు
- జిల్లాలో 616 ఆర్బీకేలు
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు నేరుగా అందజేత
- రైతులకు సూచనలు, సలహాలిచ్చేందుకు అందుబాటులో సిబ్బంది

మార్కాపురం: రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలున్నాయి. మొత్తం 36 మండలాల పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, దర్శి, సింగరాయకొండ వ్యవసాయ సబ్‌డివిజన్లు ఉన్నాయి. మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, అర్ధవీడు మండలాలుండగా, గిద్దలూరు పరిధిలో బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాలు ఉన్నాయి. యర్రగొండపాలెం పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి.

రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికింది. విత్తనం దగ్గర్నుంచి పండించిన ఉత్పత్తులు అమ్ముకునే వరకూ రైతుభరోసా కేంద్రాలు ఉపయోగపడుతున్నాయి. ఆర్బీకేల్లో వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తారు. వీరు క్షేత్ర స్థాయిలో పొలాలకు వెళ్లి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. ఆర్బీకేల్లో టీవీలను కూడా ఏర్పాటుచేసి శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నారు. మొత్తం 65 రకాల సేవలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఇందులో వ్యవసాయ శాఖకు సంబంధించి 16, ఉద్యాన శాఖ 12, పశుసంవర్ధక శాఖ 21, మత్స్యశాఖ 11, మార్కెటింగ్ శాఖకు సంబంధించి 5 సేవలను రైతులకు అందిస్తున్నారు. ప్రకృతి విపత్తులు వచ్చి రైతులకు నష్టం జరిగినప్పుడు ఆర్బీకేల్లో ఉండే సిబ్బంది వెంటనే పంట నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో అదే సీజన్‌లోనే పంట నష్ట పరిహారం రైతులకు అందుతోంది. ప్రతి ఆర్బీకే పరిధిలో రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు. దీనితోపాటు రైతుభరోసా నిధులు, పంటల బీమా, సున్నావడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అమలు చేస్తున్నారు. ప్రతి ఆర్బీకే పరిధిలో కస్టం హియరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలను రైతులకు అందుబాటులో ఉంచారు.



నాయుడుపల్లిలో ఈక్రాప్ నమోదు చేస్తున్న ఆర్‌బికె సిబ్బంది



మిర్చిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ శ్రీనివాసులు



శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

మార్కాపురం సబ్‌డివిజన్‌లో ఇలా...

మండలం	ఆర్‌బీకేలు	సొంత భవనాలు	అద్దె భవనాలు
మార్కాపురం	23	10	13
పెద్దారవీడు	12	9	3
తర్లుపాడు	11	6	5
కంభం	14	9	5
అర్ధవీడు	12	11	1
మొత్తం	72	45	27

సకాలంలో శనగ విత్తనాల పంపిణీ



గతంలో శనగ విత్తనాల కోసం మండల అగ్రికల్చర్ ఆఫీసుకు వెళ్లి రెండు మూడు రోజులు క్యూలో ఉండాల్సి వచ్చేది. పనుల కాలంలో ఇలా ఉండాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు ఈ బాధలు తప్పాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా మా గ్రామానికి తీసుకొచ్చి అధికారులు ఇస్తున్నారు. దీని వలన సమయం ఆదా అవడంతోపాటు నాణ్యమైన విత్తనాలు కూడా అందాయి. రైతు భరోసా కేంద్రాలు మాకు చాలా ఉపయోగపడుతున్నాయి. సీయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– పిన్న వెంకటరెడ్డి, రైతు, ఎల్‌బీఎస్ నగర్

మా సమస్యలన్నీ గ్రామంలోనే పరిష్కారం



గతంలో పంట నష్టపరిహారం కానీ, రైతు భరోసా నిధుల్లో ఏవైనా సమస్యలు ఉంటే అగ్రికల్చర్ ఆఫీసు చుట్టూ తిరిగేవారం. ఇప్పుడు ఆర్‌బీకేలు ఉండటంతో మా సమస్యలన్నీ గ్రామస్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయి. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు, కందులు, మినుములు సబ్సిడీపై ఇస్తున్నారు. మేము వేసిన పంటలను ఈ క్రాప్ నమోదుచేసి ఉచిత పంటల బీమాకు అర్హత పొందేలా చేస్తున్నారు.

– ఏ చెన్నారెడ్డి, రైతు, కోలభీమునిపాడు

రైతులు ఉపయోగించుకోండి



గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను రైతులు ఉపయోగించుకోవాలి. ఆర్‌బీకేల వలన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, రైతులకు అందుతున్నాయి. ఏదైనా విపత్తు వచ్చినప్పుడు ఎంత నష్టం జరిగిందో త్వరగా అంచనా వేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. దీనివలన పరిహారం త్వరగా అందించగలుగుతున్నాం. పేద, ధనిక తేడా లేకుండా నిజమైన రైతుకు ఆర్‌బీకేల ద్వారా లబ్ధి జరుగుతోంది.

– సీహెచ్ రమాదేవీ, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, మార్కాపురం

ధాన్యం వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

- డీఎస్ఓ విజయభాస్కర్



సమావేశం నిర్వహిస్తున్న డీఎస్‌ఓ ఉదయభాస్కర్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రేడర్స్, హోల్‌సేలర్స్, రిటైలర్స్, మిల్లర్స్ అందరూ వారి వద్ద ఉన్న ధాన్యం నిల్వలు, బ్రోకెన్‌రైస్, నాన్‌బాస్మతి బియ్యం, పారాబాయిల్డ్ రైస్, బాస్మతి రైస్ తదితర వివరాలు సంబంధిత పోర్టల్‌లో వారంలోపు నమోదు చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) ఉదయభాస్కర్ సూచించారు. శుక్రవారం డీఎస్‌ఓ కార్యాలయంలో ధాన్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో డీఎస్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వివరాలు నమోదు చేయడంతో పాటు ఇక నుంచి ప్రతి శుక్రవారం నిరంతరంగా ప్రక్రియ కొనసాగించాలన్నారు. బియ్యం వ్యాపారులకు సంబంధించిన అమ్మకం, నిల్వ పోర్టల్‌లో నమోదు వంటి చర్యలను మండల పరిధిలోని సీఎఎస్‌డీటీలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారులు తప్పకుండా స్టాక్ వివరాలను ప్రదర్శించాలన్నారు. దీనిలో సహాయ పౌర సరఫరాల అధికారి పుల్లయ్య, రైస్ మిల్లర్స్, వ్యాపారులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షపై సమగ్రంగా సమీక్ష

ఒంగోలు: సమగ్రశిక్ష ప్రకాశం జిల్లా విభాగంపై జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శుక్రవారం సమగ్రంగా సమీక్షించారు. కార్యాలయానికి వచ్చే, బయటకు పంపే ఉత్తర్వులకు సంబంధించి ఏ ఉద్యోగి బాధ్యతలు ఏంటి, ఎలా చేయాలనే దానిపై పలు సూచనలు చేశారు. వచ్చిన ప్రతి అర్జీకి సెక్షన్ వారీగా తేదీతో సంతకం చేసి నంబర్‌తో సహా సూపరింటెండెంట్‌కు 24 గంటల్లోగా పంపాలన్నారు. కోర్టు కేసులు, వాటిలో ఎన్నింటికి కౌంటర్లు వేశారు, పెండింగ్ ఏమైనా ఉన్నాయా అని విచారించారు. ఈనెలాఖరులోపు పర్సనల్ రిజిష్టర్లను గుమస్తాలు అందరూ మెయింటైన్ చేయాలని ఆదేశించారు. సెక్టోరల్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది, ఆఫీస్ సబార్డినేట్లు కూడా వారి విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబులు సక్రమంగా పనిచేసేట్లు చూడాలని నోడల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. యుడైస్ రాష్ట్రంలో 3.60 లక్షల మంది కన్ఫర్మ్ చేసుకోవడంతో ఏఎస్‌వో అంజిరెడ్డిని అభినందించారు. నాడు-నేడు కార్యక్రమాలు, జిల్లా ఉమ్మడి పరీక్ష విభాగాలను సైతం సమీక్షించారు.

జగనన్న సైనికుడిలా పనిచేస్తా



వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- మహిళలకు అండగా నిలుస్తున్న జగనన్నను ఆశీర్వదించండి
- సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగరేద్దాం
- మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- వైఎస్సార్ ఆసరా నాలుగో విడత రూ.7.23 కోట్ల విలువైన నిధుల అందజేత

చీమకుర్తి: ఆర్థిక సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి చీమకుర్తి రూరల్ పరిధికి సంబంధించిన వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా వారి కాళ్లమీద వారు నిలబడేలా అండగా నిలిచారని గుర్తు చేశారు. సీఎం ఆదేశాల మేరకే తాను వేమూరు నుంచి సంతనూతలపాడు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నానన్నారు. జగన్ సైనికుడిలా పనిచేసి స్థానిక ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడతానని అన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించి సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరోసారి ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ 99 శాతం వరకు నెరవేర్చాడని, మళ్లీ సీఎంగా గెలిపించేందుకు మహిళలు తమ వంతు సహకారం అందించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే ఇప్పుడొస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వస్తాయన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడతకు చెందిన నిధులు రూ.7.23 కోట్ల విలువైన చెక్కును ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల సందర్భంగా థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్రదర్శించిన ప్లకార్డులు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మెప్మా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పేపర్ ప్లేట్ల తయారీ మిషన్‌ను మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గోగినేని వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి



జాషువా విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- భారతజాతి సంపద మహాకవి గుర్రం జాషువా
- గుర్రం జాషువా విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు సురేష్, మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు టౌన్: గుర్రం జాషువాను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ప్రకాశం భవనంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో గుర్రం జాషువా సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాకవి గుర్రం జాషువా విగ్రహాన్ని, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా.ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఎదురుగా గుర్రం జాషువా సాహిత్య జయభేరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాసభలో ఆయన ప్రసంగించారు. గుర్రం జాషువా విగ్రహాన్ని ప్రారంభించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని మేరుగు నాగార్జున చెప్పారు. అస్పృశ్యతను, అంటరానితనాన్ని ఎదుర్కొని దేశం గర్వించే స్థాయికి ఎదిగిన గుర్రం జాషువా ఆలోచనలు ఇప్పటి తరానికి స్ఫూర్తి ఇస్తాయన్నారు. ఆయన రచించిన గబ్బిలం, పిరదౌశి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. గుర్రం జాషువా జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంచి మనసున్న నాయకుడని కొనియాడారు. ప్రపంచ ప్రజలు గర్వించే మహామేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తులో నిర్మించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగన్ ఆలోచనలు ఎప్పుడూ పేదల పక్షంగా ఉంటాయని, అంబేడ్కర్ ఆలోచనలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డే అని, ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. మహాకవి గుర్రం జాషువా ఒక కులానికి, మతానికి సంబంధించిన వ్యక్తి కాదని, యావత్ భారత జాతి మొత్తం గర్వంగా చెప్పుకునే విశ్వనరుడని మంత్రి డా.ఆదిమూలపు సురేష్ కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గుర్రం జాషువాకు సముచిత స్థానం కల్పించేందుకు నాలుగున్నరేళ్లుగా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది జాషువా జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని, దీన్ని కొనసాగించేందుకుగాను త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం జాషువా స్మృతి వనాన్ని పూర్తిగా విస్మరించిందని, జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గుంటూరు నడిబొడ్డున రూ.2 కోట్లతో స్మృతి వనాన్ని నిర్మించేందుకు చురుగ్గా కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే నెల్లూరులో జాషువా స్మారక గ్రంథాలయాన్ని పునరుద్ధరించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ రూ.50 లక్షల నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే స్మారక గ్రంథాలయాన్ని పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఒంగోలులోని కలెక్టరేట్ ప్రాంగణంలో గుర్రం జాషువా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, రాష్ట్రంలో ఎక్కడా పాలనాపరమైన కార్యాలయాల ప్రాంగణంలో ఇలాంటి విగ్రహం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ ఘనత ప్రకాశం జిల్లాకే దక్కిందన్నారు. దేశంలోని అనేక మంది సంఘ సంస్కర్తకంటే ముందే జాషువా అనేక సంస్కరణలను ప్రస్తావిస్తూ రచనలు చేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. జాషువా రచనలు సమాజంలో ఆలోచనలను రేకెత్తించాయని, ఆయన ధిక్కార స్వరం జాతిని జాగృతం చేసిందని బీసీ నాయకులు బొట్ల రామారావు అన్నారు. జాషువా విగ్రహం కోసం జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. జాషువా సాహిత్య సేవా సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె.కనకారావు, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పాటిబండ్ల ఆనందరావు, జాషువా మనవరాలు యామిని, దళిత సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యంపైన శ్రద్ధ పెట్టాలి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



విద్యార్థుల నోటిలో ఆల్‌బెండజోల్ మాత్రలను వేస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైన శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి చిన్నారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ చేతిగోళ్లను చిన్నగా, శుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగడం, కూరగాయలు, పండ్లను శుభ్రమైన నీటితో కడగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు తినక ముందు, తిన్న తరువాత, మరుగుదొడ్డి వాడిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే 19 ఏళ్లలోపు వారిలో నులిపురుగుల నిర్మూలనకు ఉచితంగా ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 19 ఏళ్లలోపు వారు 5,96,751 మంది ఉన్నారని, అంగన్‌వాడీలు, పాఠశాలలు, కాలేజీల్లోని పిల్లలతోపాటు ఇతరులకు వీటిని పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు చేపట్టామన్నారు. శుక్రవారం మాత్రలు పొందలేని వారికోసం ఈనెల 16న ప్రత్యేక మ్యాప్ అప్ కార్యక్రమం చేపట్టి పంపిణీ చేస్తామన్నారు. నులిపురుగులు లేకుండా 6 నెలలకు ఒకసారి అందరూ ఆల్‌బెండజోల్ వేసుకోవాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, కనుక బాలల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. శుభ్రమైన జీవన శైలిని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. బయటి ఆహారాన్ని సాధ్యమైనంత వరకు తినరాదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సురేష్‌కుమార్, డీఐఓ పద్మజ, డీఈవో సుభద్ర, నోడల్ ఆఫీసర్ భగీరథీదేవి, డీపీఎం వాణిశ్రీ, ప్రిన్సిపాల్ రామిరెడ్డి, సీడీపీవో రాజకుమారి, కార్పొరేటర్ శాండిల్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్చిలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

- పరీక్ష ఫీజు ఈనెల 20లోగా చెల్లించాలి

ఒంగోలు: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు మార్చిలో గుర్తించిన పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు లోయర్ గ్రేడ్ పరీక్షలు అయిన డ్రాయింగ్, టైలరింగ్, హ్యాండ్లూమ్ పరీక్షలకు అర్హులన్నారు. లోయర్ గ్రేడ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు మాత్రమే హయ్యర్ గ్రేడ్ పరీక్షలకు అర్హులన్నారు. ఈనెల 20వ తేదీలోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలని, రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 29వ తేదీ వరకు, రూ.75 అపరాధ రుసుంతో మార్చి 6వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. సంబంధిత దరఖాస్తు, నామినల్ రోల్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మార్చి 7వ తేదీలోపు సమర్పించాలని పేర్కొన్నారు. లోయర్ గ్రేడ్ డ్రాయింగ్ రూ.100, హ్యాండ్లూమ్ వీవింగ్ రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హయ్యర్ గ్రేడ్‌కు సంబంధించి డ్రాయింగ్ రూ.150, హ్యాండ్లూం వీవింగ్ రూ.200, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ రూ.200 ఫీజును గేట్‌వే ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి దివ్యాంగురాలు ఆత్మహత్య



రైలు పట్టాలపై కుసుమ మృతదేహం

సింగరాయకొండ(మర్రిపూడి): రైలు క్రింద పడి దివ్యాంగురాలు పోకూరి కుసుమ(26) ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధ్యాహ్నం సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై బుకింగ్ కౌంటర్ సమీపంలో రైలు పట్టాలపై చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన పోకూరి రామయ్య, సుబ్బమ్మ కుమార్తె కుసుమ పీజీ వరకు చదివింది. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై చాలా సేపు ఫోన్ మాట్లాడుతూ ఉన్న ఆమె గూడ్స్ రైలు రావడాన్ని గమనించింది. ఒక్కసారిగా పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడింది. మృతికి గల కారణాలు తెలియలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.

వెల్లంపల్లి బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగుచూసింది. మద్దిపాడు పోలీసుల కథనం మేరకు.. నల్ల ప్యాంట్, తెల్ల చొక్కా వేసుకున్న వ్యక్తి బ్రిడ్జి కింద అచేతనంగా పడి ఉండటం గమనించిన స్థానికులు వీఆర్‌ఓ అరుణకు తెలియజేశారు. ఆమె మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒంగోలు రూరల్ సీఐ రాజమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

జగనన్న పోరాటం పేదరికంపైనే..

- రాజకీయ పార్టీలు, ప్రతిపక్షం మీద కానే కాదు..
- ప్రాణం విలువ తెలిసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్
- రాష్ట్రంలో 50 వేల మందికి పైగా డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ సురేష్ స్పష్టీకరణ
- కొండపి సీహెచ్‌సీలో రూ.1.35 కోట్లతో నిర్మించిన అత్యాధునిక భవనం ప్రారంభం



ఆధునిక నేత్ర వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

కొండపి(మర్రిపూడి): ‘ప్రాణం విలువ తెలిసిన మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే వైద్యరంగానికి అధికంగా నిధులు కేటాయించారు. జగనన్న పోరాటం పార్టీలు, ప్రతిపక్షం మీద కాదు, కేవలం పేదరికంపైనే..’ అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. కొండపి మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిలో రూ.1.35 కోట్లతో ఏపీఎంఎస్ఐడీసీ ఒంగోలు రిమ్స్ డివిజన్ ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో ‘మెగా’ ఇంజినీరింగ్ సంస్థ నిర్మించిన అత్యాధునిక భవనాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. ఆస్పత్రి ఆధునీకరణతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో నాడు–నేడు పథకం కింద 9 ఆస్పత్రులను సుమారు రూ.75 కోట్లతో ఆధునీకరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ లాంటి కార్యక్రమాలు చేపట్టి ఇంటివద్దకే వైద్య సేవలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే అని కొనియాడారు.

కొండపి సీహెచ్‌సీలో 50 మంది డాక్టర్లు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. డాక్టర్ల కొరత లేకుండా స్పెషలిస్టు డాక్టర్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 50 వేల మందికి పైగా డాక్టర్లను నియమించిన ఘనత జగనన్నదే నని ప్రశంసించారు. కొండపి ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, ఫిజీషియన్, డెంటల్, పీడియాట్రిస్ట్, కంటి వైద్య నిపుణులు, అల్ట్రాస్కానింగ్ సిస్టం, ఫిజియోథెరపీ డాక్టర్లు ఉన్నారని వివరించారు. నియోజకవర్గంలోని ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. డీసీహెచ్‌ఎస్ ఎస్ఎన్ మూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వరలక్ష్మి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి, వైస్ ఎంపీపీ కోటంరాజు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, బొక్కిసం సుబ్బారావు, సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి



కొండపిలో సీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

టీడీపీ నాయకుడు పశువుల బీడు కాజేశాడు

- కుటుంబ సభ్యులు, బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు
- తాత్కాలిక ప్రత్యామ్నాయ మార్గాన్నీ చెడగొట్టాడు
- జేసీ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేసిన దర్శి రైతు సంఘం కార్యదర్శి



జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటేశ్వరరావు

కురిచేడు: కురిచేడు మండలం గొల్లపాలెం సర్వే నంబర్ 77లో పశువుల బీడు దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం దర్శి నియోజకవర్గ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక గుంటక నాసరరెడ్డి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జేసీ రోణంకి గోపాలకృష్ణ, కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్‌కు సమస్యను వివరించారు. అనంతరం ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతి రావుతో కలిసి విలేకర్లకు వివరాలు వెల్లడించారు. గొల్లపాలెం నుంచి కొండకు వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 77/1,2,3,4,5లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని 2002లో అప్పటి సర్పంచ్, టీడీపీ నాయకుడు మేరువ పెద్దిరెడ్డి ఆక్రమించి తన కుటుంబ సభ్యులు, బినామీల పేర్లతో పట్టాలు పొందారన్నారు. ఈ భూమిలో నుంచి వెళ్లే ఉసుల్ల బండ, దండిబాటను ఆక్రమించి, పశువులను రానీయకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈ విషయమై అనేక సార్లు జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదన్నారు. గత ఏడాది ఆగస్టు నెల 14వ తేదీన పది వేల గొర్రెలతో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించినట్లు గుర్తు చేశారు. దాంతో స్పందించిన అప్పటి తహసీల్దార్ జ్వాలా నరసింహం ప్రత్యామ్నాయ దారిని చూపించారన్నారు. ప్రస్తుతం ఆ దారిని కూడా ఆక్రమించి చెడగొట్టారని, కలెక్టర్ స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధికంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ గ్రామ కమిటీ సభ్యులు మువ్వా శ్రీనివాసరావు, బొరిగొర్ల పెద్ద గాలివెంకటయ్య, మువ్వా పిచ్చయ్య, మువ్వా పెద్ద సుబ్బారావు, తెల్లగొర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లౌకిక భావనతో విద్యార్థుల్లో పురోగతి



బాలోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- బాలోత్సవం ప్రారంభ సభలో జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
- ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ఒంగోలు టౌన్: చిన్నారుల్లో మతసామరస్య భావన అన్ని రంగాల్లో రాణించడానికి దోహదపడుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న బాలోత్సవ్‌ను శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బాలోత్సవం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ప్రసంగిస్తూ.. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను , మతసామరస్యాన్ని పెంపొందించడమే బాలోత్సవం ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. పిల్లల ఆలోచనలను కులమతాలకతీతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తలిదండ్రులు, ఉపాధ్యాయుల మీద ఉందన్నారు. రేపటి భవిష్యత్తును సుందరంగా మలుచుకోవడం మన చేతుల్లోనే ఉందని, విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించడం అలవాటు చేసుకుని ఉన్నత శిఖరాలనధిరోహించాలని కోరారు. పుట్టిన దేశానికి, జన్మనిచ్చిన తలిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. నేటి విద్యావిధానంలో పిల్లలు ఒత్తిడిని అధిగమించడానికి బాలోత్సవం ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవం కార్యక్రమ నిర్వహణకుగాను జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.4.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే బాలోత్సవం లాంటి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. బాలోత్సవాలకు వేలాది మంది చిన్నారులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. నైపుణ్యం కలిగిన పిల్లలు ఏ పని చేసినా విజయం సాధిస్తారని నగర మేయర్ గంగాడ సుజాత చెప్పారు. చదువుతో పాటుగా పిల్లలను అన్నీ రంగాలలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి మరింతగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం సూచించారు. బాలోత్సవంలో 47 ఈవెంట్స్ ఏర్పాటు చేశామని, ప్రతి ఈవెంట్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీవైఈఓ అనితరాణి, ప్రతిభ కాలేజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పాటిబండ్ల ఆనందరావు, పీవీఆర్ స్కూల్ హెచ్‌ఎం మువ్వ రాధిక, ఏడీ సురేఖ, బాలోత్సవం కమిటీ సభ్యులు ఎస్.రవి, దామా శ్రీనివాసులు, మాలిక్, అబ్దుల్ హై, వినోద్, బషీర్, కొండారెడ్డి, సులోచన, ప్రభాకర్ రెడ్డి, రంగనాయకులు, శైలజ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి.. మానవ హక్కుల ఉల్లంఘనే..



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు

ఒంగోలు: వెట్టిచాకిరి అనేది మన దేశంలో ఎంతో కాలంగా ఉన్న ఒక సామాజిక వెనుకబాటుతనమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆవరణలో వెట్టిచాకిరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాండెడ్ లేబర్ అబాల్షన్ సిస్టం చట్టాన్ని 1976 ఫిబ్రవరి 9న మన దేశంలో ఆమోదించినట్లు తెలిపారు. వెట్టిచాకిరి వ్యవస్థ అనేది కార్మిక సంబంధం అయిన నేరం మాత్రమే కాదని, ఇదో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. 1976 నాటికి వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం ద్వారా ప్రభుత్వం బానిసత్వానికి గురిచేయడాన్ని నేరంగా పరిగణిస్తుందన్నారు. వెట్టి చాకిరి నిర్మూలనకు అందరం కృషిచేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు సుమన్ శ్రీనివాసరావు, బాలకాశమ్మ, ప్రియాంక పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న హేమచంద్రారెడ్డి

ఒంగోలు: పర్యావరణ పరిరక్షణే ప్రపంచ మానవాళి ధ్యేయం కావాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఓజోన్ పొర దెబ్బతింటున్నందున మానవాళి మనుగడకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించాలని, సమాజాన్ని జాగృతం చేసేందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏకేయూ రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, పాలక మండలి సభ్యులు డాక్టర్ కళ్యాణి, కొనిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ కేవీఎన్ రాజుతోబాటు విశ్వవిద్యాలయంలోని పలు శాఖల అధిపతులు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విశ్వవిద్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధం

- సీఎం సువర్ణ అవకాశం ఇచ్చారు
- మార్కాపురం ప్రజల రుణాన్ని తీర్చుకోలేనన్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: త్వరలో జరగబోయే ఎన్నికల్లో గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ అవకాశం ఇచ్చారని, ఆ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. తన తండ్రి కేపీ కొండారెడ్డి 1972 నుంచి రాజకీయాల్లో ఉన్నారనీ, మూడు దఫాలు సమితి ప్రెసిడెంట్‌గా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా మార్కాపురం నియోజకవర్గంలో ప్రజలకు సేవలందించారన్నారు. తన మామ ఉడుముల శ్రీనివాసుల రెడ్డి కంభం ఎమ్మెల్యేగా ప్రజలకు సేవచేయడంతో 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలు జగనన్న అభిమానులు తనను 18,600 మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మార్కాపురానికి మెడికల్ కాలేజీ, షాదీఖానా, బీసీభవన్, అంబేద్కర్ భవన్, పొదిలి పెద్దచెరువు అభివృద్ధి, మార్కాపురానికి రెండో ఫేజ్ నీటి సరఫరా పథకం తదితర అభివృద్ధి కార్యక్రమాలన్నీ చేపట్టినట్లు చెప్పారు. శాశ్వతంగా కరువును నివారించే వెలిగొండ ప్రాజెక్టు కూడా పూర్తైందన్నారు. ఐదేళ్లలో తాను ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి గడప గడపకు మన ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ప్లీనరీ, సామాజిక సాధికార బస్సుయాత్ర తదితర కార్యక్రమాలన్నీ సమర్థవంతంగా నిర్వహించాననీ, ప్రజల ఆదరణ, అభిమానాన్ని తాను ఎన్నడూ మర్చిపోలేనన్నారు. మార్కాపురం, పొదిలి, కొనకనమిట్లలో వైద్యశాలల అభివృద్ధికి కృషి చేశానన్నారు. 3 సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టానన్నారు. అందరి సహకారంతోనే మార్కాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగానన్నారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

గిద్దలూరులో పోటీకి సిద్ధం:

త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిద్దలూరు నుంచి పోటీ చేయాలని ఆదేశిస్తూ సువర్ణ అవకాశం కల్పించారని, ఆయనకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. గిద్దలూరు కూడా పశ్చిమ ప్రకాశంలో భాగమేనన్నారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో జగనన్న సహకారంతో అభివృద్ధి చేస్తానని, ఆప్రాంత ప్రజలకు సేవచేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. అక్కడి ప్రజల కష్టసుఖాల్లో తాను అండగా ఉంటానని, ప్రతీ కార్యకర్తకు, సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండి అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని నాగార్జునరెడ్డి తెలిపారు. ప్రెస్‌మీట్‌లో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, యార్డు చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, ఎంపీపీలు అరుణాచెంచిరెడ్డి, భూలక్ష్మి రామ సుబ్బారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, దాసరి ఏడుకొండలు, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ కన్వీనర్లు సత్యనారాయణ యాదవ్, మురారి వెంకటేశ్వర్లు, నూర్జహాన్, శంకర్‌రెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

నకిలీ ఆస్తి ధ్రువీకరణ పత్రాల ముఠా అరెస్టు

ఒంగోలు టౌన్: జిల్లాలోని పొదిలి, కనిగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో నిందితులకు జామీను ఇచ్చేందుకు న్యాయవాది ఎం.కృష్ణారావు మరికొందరితో కలిసి నకిలీ ఆస్తి ధ్రువీకరణ పత్రాలు సృష్టించి కోర్టులో సమర్పించినట్లు కోర్టు సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనిగిరి పోలీసు స్టేషన్‌లో ఒకటి, పొదిలి పోలీసు స్టేషన్‌లో 5 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి పోలీసు స్టేషన్‌లో ముద్దాయిలైన నాగులూరి శాంసన్, నాగులూరి సుధాకర్‌కు బెయిల్ మంజూరు చేసిన జిల్లా జడ్జి కనిగిరి జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ వద్ద రెండు షూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కేసుల్లో నిందితులు నకిలీ షూరిటీలతో కోర్టుకు వచ్చిన జామీనుదారుల వివరాలు సరిగా చెప్పలేకపోవడంతో జడ్జి అనుమానించారు. ఆస్తి ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించి నకిలీవిగా గుర్తించారు. దీంతో ఈ కేసులో న్యాయవాది కృష్ణారావుతో సహ మిగతా నిందితులందరినీ అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ స్టాంపులు, ఆస్తి ధ్రువీకరణ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. ఈ తరహా కేసులకు సంబంధించి విచారణ జరుపుతున్నామని, మిగతా నిందితులను కూడా అరెస్టు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

ఫోర్జరీ జామీన్లతో కోర్టుకు బురిడీ

తాలుకా స్టేషన్ పరిధిలో 4 కేసులకు సంబంధించి 8 మంది నిందితులు లాయర్ సలహాతో తప్పుడు ఆస్తి పత్రాల సాయంతో ఒంగోలులోని మూడో అదనపు మున్సిఫ్ కోర్టులో బెయిల్ పొందారు. ఫోర్జరీ జామీన్ల విషయాన్ని ఎస్పీ మలికా గర్గ్‌కు జిల్లా జడ్జి ఎ.భారతి వివరించడంతో వెంటనే స్పందించిన ఎస్పీ విచారణకు ఆదేశించారు. తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన షేక్ మున్నా, నూనె శ్రీధర్ బాబు, బండారు వెంకటేష్, కాకాని రోడ్డుకు చెందిన ఏనుమల జయరావు, అమరావతి రోడ్డుకు చెందిన మంచాల అజయ్ బాబు, పెదకాకానికి చెందిన పళ్లా వెంకటేశ్వర్లు, రాసుపాలెం గ్రామానికి చెందిన చద్దలవాడ నారాయణమ్మ, బ్రాడీపేటకు చెందిన దిశాల శివకుమారిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మణ్ తెలిపారు.